క్లుప్తంగా

సామాజిక తనిఖీపై కోఆర్డినేటర్లకు శిక్షణ



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పలు రకాల పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు గాను శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో కోఆర్డినేటర్లకు శిక్షణ నిర్వహించారు. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీల్లో 1,536 పనులు జరిగాయని ఏపీఓ శేఖర్‌గౌడ్ తెలిపారు. చెరువులు, పంట కాల్వల పూడికతీత, పండ్ల తోటల పెంపకం, రైతుల పొలం పనులు, సీసీ రోడ్ల నిర్మాణాలు, స్కూల్స్‌లో మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను ఈజీఎస్ నిధుల ద్వారా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పనులు చేయడంలో పాల్గొన్న కూలీలకు రూ.4.76 కోట్లు, మెటీరియల్ కోసం రూ.1.66 కోట్లు, మొత్తం రూ.6.66 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ బాలు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



వీపనగండ్ల: అనారోగ్యానికి గురైన వారికి ఆర్థిక చేయూతనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాధితులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎత్తం కృష్ణయ్య, గంగిరెడ్డి అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పొందిన వారిలో అంతటి పెద్దనర్సింహ, కుర్వ అనూష, సీహెచ్ రాముడు, లలితమ్మ, రత్నయ్య, కొండయ్య, కిష్టయ్య, క్రిష్ణవేణి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నక్క విష్ణు, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, గోపి, కావలి మహేశ్, సర్వారెడ్డి, పెద్ద రాముడు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన రాముడు తన సెల్‌ఫోన్ పోయిందని శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు రాముడుకు ఫోన్ అప్పగించామన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయిన లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని ఆయన సూచించారు.

మంత్రి జూపల్లి జన్మదిన వేడుకలు



వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలితో పాటు సంగినేనిపల్లి, కల్వరాల, తూంకుంట తదితర గ్రామాల్లో కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. మంత్రి కృషి వల్ల నియోజకవర్గంలోని మౌలిక వసతులు మెరుగుపడడమే కాక రైతులు, మహిళలు, ఆర్థికంగా బలపడుతారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, ఇంద్రకంటి వెంకటేశ్, ఎత్తం కృష్ణయ్య, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, యాదయ్య, రవీందర్‌రెడ్డి, మీసాల మోహన్, మౌలాలీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: రేమద్దుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌రెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శేఖర్‌రెడ్డి రెండు రోజుల క్రితం వనపర్తి సమీపంలో నాగవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం గ్రామానికి తీసుకరావడంతో మంత్రి గ్రామానికి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రవికుమార్, వెంకటేష్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మయ్య, వాల్మీకినాయుడు, రాంచంద్రయ్య ఉన్నారు.

నేను రాను.. సర్కార్ దవాఖానాకు

- రోగులకు అందని వైద్యం
- వైద్యుల కొరతతో ఇబ్బందులు
- తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్‌కు పరుగులు



ఓపీ చూస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్



పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది కొరత పేదల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలోనే క్షేత్రస్థాయిలో పేదలకు సరైన వైద్య సేవలు అందడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితులు పేదలు అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 36వేల జనాభా, మున్సిపాలిటీ పరిధిలో 19 వేలు జనాభా ఉంది. 55వేల జనాభాకు కేవలం మండల కేంద్రంలో ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇందులో కేవలం 5 పడకలు ఉన్నాయి. వివిధ గ్రామాల నుంచి ప్రతి నిత్యం గర్భిణులు, ఇతర పరీక్షల కోసం నిత్యం 100 నుంచి 180 మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారని సిబ్బంది తెలిపారు.

7 సబ్ సెంటర్లు

మండలంలో 7 సబ్ సెంటర్లు ఉండగా.. రెండు సబ్ సెంటర్లలో మాత్రమే డాక్టర్లు ఉన్నారు. మిగతా వాటిలో ఏఎస్‌ఎంలే చూసుకుంటున్నారు. వారు కూడా మధ్యాహ్నం వరకే అందుబాటులో ఉంటున్నారు. మండల ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయి సిబ్బంది ఇద్దరు డాక్టర్లు, 4 స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్లు 4, సీనియర్ అసిస్టెంట్ ఒకరు, ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు, ఫార్మసిస్టు ఒకరు చొప్పును పోస్టులు ఉండాలి. కానీ ఇద్దరు డాక్టర్లు లేరు. 3 స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు పురుష సూపర్‌వైజర్లు అవసరం. సీనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీ ఉండడంతో రోగులకు వైద్యం అందక ఇబ్బందులు తప్పడం లేదు.

ఎంఎల్‌హెచ్‌పీలే దిక్కు..

పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు 6 నెలలుగా లేకపోవడంతో సబ్‌సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ లే విడతల వారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో సిబ్బందిని నియమించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

100 పడకల ఆస్పత్రిగా మార్చాలి

జాతీయ రహదారి ఆనుకొని ఆరోగ్య కేంద్రం ఉంటుంది. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తే సిబ్బంది లేరు. తప్పనిసరి పరిస్థితుల్లో 20 కిలోమీటర్లు తీసుకెళ్లాల్సి వస్తుంది. దీని దృష్టిలో పెట్టుకొని పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలి. పూర్తి స్థాయిలో డాక్టర్లు, సిబ్బందిని నియమించాలి.

– దిలీప్‌రెడ్డి, పెబ్బేరు

వైద్యం అందట్లేదు

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన డాక్టర్లు లేక పీహెచ్‌సీకి కానుపులకు వచ్చే గర్భిణులు, బాలింతలకు , రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాతంలో ఉన్న సబ్ సెంటర్లకు కూడ వైద్యులను నియమించి గ్రామీన ప్రజలకు సరైన వైద్యం అందించాలి.

– జి శేఖర్‌సాగర్, పెబ్బేరు

శాఖాపరమైన చర్యలు

పెబ్బేరు పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవం. త్వరలో పూర్తి స్థాయిలో వైద్యులను, స్టాఫ్‌నర్సులు, సిబ్బందిని నియమిస్తాం. విధుల్లో అలసత్వం వహించే వైద్యులపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శివకుమార్

కొత్తకోట రూరల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో నేరాలను కట్టడి చేయొచ్చని పెద్దమందడి ఎస్‌ఐ శివకుమార్ సూచించారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో శనివారం ఆయన సీసీ కెమెరాలు ఏర్పాటు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఎస్పీ సూచన మేరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని ప్రధాన రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్ నడిపే వారికి జరిమానాలు విధిస్తామని తెలిపారు. ద్విచక్రవాహనదారులు బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ పేపర్లు తమ వెంటే ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లకు వచ్చే అనవసర లింక్‌లు నొక్కరాదని, ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు అపరిచిత వ్యక్తులకు చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శేఖర్, భగవంతు, మాజీ సర్పంచ్ తిక్కన్న, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, రఘుగౌడ్, కేశవరెడ్డి, కారోబార్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాన్‌గల్: దాడి చేసిన ఘటనపై శనివారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గిరిగింజమిట్ట తండాకు చెందిన మూడావత్ చంద్రకళ తన ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 9వ తేదీన మాట్లాడుతుండగా తన మరిది మూడావత్ కృష్ణ మద్యంలో తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన మరిది కుమారుడి పెళ్లి విషయం పట్టించుకోవడం లేదని తన భర్త రాజును అకారణంగా బూతులు తిడుతూ కట్టెతో కొడుతుండగా చంద్రకళ, అత్త పీకిలమ్మ విడిపించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో కట్టెతో చంద్రకళ తలపై కృష్ణ దాడిచేయగా ఆమె తలకు గాయమైందన్నారు. అకారణంగా తనపై, తన భర్తపై దాడి చేసి గాయపర్చిన మూడావత్ కృష్ణపై తగు చర్యలు తీసుకోవాలని చంద్రకళ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



కొత్తకోట: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో సంభవించిన వరద బాధితులను ఆదుకునేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని వ్యాపారస్తుల నుంచి విరాళాలు సేకరించారు. ప్రకృతి విపత్తు కారణంగా వందలాది మంది చనిపోవడంతో తమ వంతు సహాయంగా విరాళాలు అందజేసిన వ్యాపారస్తులకు భవన నిర్మాణ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. సేకరించిన విరాళం మొత్తాన్ని త్వరలోనే కేరళకు వెళ్లి అక్కడి సీఐటీయూ నాయకులు అందజేస్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీను, జనార్దన్, అస్కని శ్రీనివాసులు, ఆశన్న, వెంకటయ్య, గొల్ల వెంకటయ్య, కుర్మన్న, బాలకృష్ణ, నాగన్న, పెద్ద రాములు, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌కు సన్మానం



కొత్తకోట రూరల్: మదనాపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లెపాగ ప్రశాంత్‌ను శనివారం కొత్తకోట రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రశాంత్ రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాలస్వామి, లక్ష్మయ్య, చంద్రయ్య, నాగరాజు, వెంకటేష్, బాలరాజు, రవి, అంజనేయులు, మన్నెం, నాగన్న, కుర్మయ్య, హన్మంత్, రవికుమా ర్, శ్రీనివాస్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అంజన్న జాతర



స్వామివారికి నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు



పూజల్లో పాల్గొన్న కేశం నాగరాజ్‌గౌడ్

అమరచింత: శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని పాత కిష్టంపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. పిండివంటలతో స్వామివారికి నైవేద్యాలను తయారు చేసి గండి దీపాలతో ఆలయ ప్రదక్షిణలు చేస్తూ స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులే కాకుండా ఇతర గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

గిరిజన సంఘం కమిటీ ఎన్నిక

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం గిరిజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా గణేష్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, పలువురు సభ్యులను నియమించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ పాల్గొన్నారు.

చంద్రగఢ్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం



విజేత జట్టుతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత: అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన చంద్రగఢ్ కోటను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. చంద్రగఢ్ కోటపై వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని రెండు రోజుల పాటు నిర్వహించిన ఒపెన్ టు ఆల్ కబడ్డీ పోటీల్లో విజేతలకు శనివారం ఆయన చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈమేరకు కోటపై వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో నిర్వహించే క్రీడలు క్రీడాకారుల్లో సోదరభావం పెంపొందిస్తాయన్నారు. గత ప్రభుత్వాలు చంద్రగఢ్ కోటతో పాటు ఉమ్మడి జిల్లాకే వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టును పర్యాటకంలో విస్మరించారన్నారు. ఇకపై చంద్రగఢ్, జూరాల ప్రాజెక్టు వద్ద పర్యాటకం అభివృద్ధి చేందేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

కబడ్డీ విజేత ఉస్మానియా యూనివర్సిటీ జట్టు

రెండు రోజుల పాటు నిర్వహించిన ఒపెన్ టు ఆల్ కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతిని హైదరాబాద్ యూనివర్శిటీ జట్టు కైవసం చేసుకుంది. మొదటి బహుమతిగా రూ.25,016 నగదుతో పాటు షీల్డ్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అందించారు. రెండో బహుమతిని మరికల్ జట్టు సాధించి రూ.20,016 నగదు షీల్డ్‌ను అందుకున్నారు. మూడో బహుమతిని మస్తీపురం జట్టు సాధించి రూ.15,016 నగదు, షీల్డ్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి పల్లకీ సేవ



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బెస్తగేరి ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామి వారికి ఉదయం నుంచి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శనివారం చివరి వారం పూజలతో పాటుగా అన్నదాన కార్యక్రమం ఉంటుందని వారు చెప్పారు.

మోటార్ వైండింగ్ షాపులో చోరీ

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామంలో శనివారం మధ్యాహ్నం మూసి ఉన్న మోటార్ వైండింగ్ షాపు వద్ద ఉన్న పాత మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన కన్నయ్య కొంతకాలంగా బోరు మోటార్ల మరమ్మతుతో పాటు వైడింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం మెకానిక్ షాపును మూసి కిష్టంపల్లి ఆంజనేయస్వామి జాతరకు వెళ్లిన ట్లు ఎస్‌ఐ తెలిపారు. సాయంత్రం తిరిగి వచ్చి రిపేరుకు వచ్చిన రెండు మోటా ర్లు కనిపించకపోవడంతో కన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. బాధి తుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యువకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో గతంలో నిర్ణయించిన భూమిలోనే మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని ఖిల్లాఘనపురం క్రాంతి క్రీడా అసోసియేషన్ సభ్యులు, మండల క్రీడాకారులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. శనివారం ఆయనను కలిసిన యువకులు 25ఏళ్లుగా క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మండలం నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సుమారుగా 200 మంది క్రీడాకారులు పతకాలను సాధించారని ఎమ్మెల్యేకు వివరించినట్లు పీఈటీ దేవేందర్ తెలిపారు. ఎలాంటి వసతులు లేకున్నా, ఎన్నో పథకాలు సాధించిన క్రీడాకారులకు ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్ వెనకాల గతంలో మినీ స్టేడియం కోసం కేటాయించిన స్థలంలో వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. కానీ ఇప్పటికీ ఈ స్థలంలో మినీ స్టేడియం ఏర్పాటుకు అనుమతులు రాలేదని చెప్పున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్రీడాకారులు, యువత బాగు కోసం ప్రభుత్వం నుంచి మినీ స్టేడియం మంజూరు చేయించాలని కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో క్రాంతిక్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు దాసర్ల శాంతయ్య, ఆర్గనైజేషన్ కార్యదర్శి దేవేందర్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐదు తరగతులు.. రెండే గదులు



చిక్కేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆఫీసు గదిలోనే బోధన

- చిక్కేపల్లి, బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఇక్కట్లు



బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో వరండాలో విద్యార్థులు

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి, బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల చదువులకు కష్టాలు ఎదురవుతున్నాయి. విద్యాబోధన బాగుండటంతో చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకే పంపుతున్నారు. చిక్కేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 50 మందికి పైగా విద్యార్థులు చుదువుకుంటున్నా.. కేవలం రెండు తరగతులే ఉన్నాయి. ఈ రెండు గదులలో ఒకటి ఉపాధ్యాయ గది ఉండగా అందులోనే బీరువాలు ఉన్న ఓ వైపు తరగతి గదిగా వినియోగిస్తున్నారు. మరో గదితో పాటు వరండాలో మూడు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు.

■ బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉంటే అందులో ఒకటి ఉపాధ్యాయ గది, మరో రెండు గదుల్లో తరగతులను నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. గదులు సరిపోక ఒక గదిలో రెండు తరగతులు, మరికొన్ని తరగతులను వరండాలో కూర్చబెట్టి విద్యాబోధన చేయాల్సి వస్తుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ పాఠశాలకు మన ఊరు, మన బడిలో ప్రహారీ గోడ మాత్రమే నిర్మాణం చేపట్టారు. కానీ అదనపు గదులకు ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. ఈ రెండు పాఠశాలల్లో గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, దీంతో పాటు గదుల కొరతతో విద్యాబోధన కూడా సక్రమంగా సాగడంలేదని ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రెండు పాఠశాలలకు అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సొంత ఊరిపై మమకారం



పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కల్కి సినిమా డైరెక్టర్ నాగ్‌అశ్విన్, తల్లిదండ్రులు డాక్టర్ జయంత్‌రెడ్డి, డాక్టర్ జయరాంరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

- పాఠశాలకు అదనపు గదులు నిర్మించిన ప్రముఖ డైరెక్టర్ నాగ్ అశ్విన్

తాడూరు: జీవితంలో ఎంత ఎత్తు ఎదిగినా.. పుట్టిన ఊరు, కన్నతల్లిని ఎప్పటికీ మరిచిపోకూడదని, కన్న తల్లితో సమానమైన సొంత ఊరు అనుబంధం పేగుబంధం లాంటిది. అలాంటి సొంత ఊరు పాఠశాల గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామం కల్కి డైరెక్టర్ నాగ్‌అశ్విన్ సొంత గ్రామం. అతని సొంత నిధులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.66లక్షలతో నూతనంగా నిర్మించిన నాలుగు అదనపు గదులను కల్కి డైరెక్టర్ నాగ్‌అశ్విన్, వారి తల్లిదండ్రులు డాక్టర్ జయంత్‌రెడ్డి, డాక్టర్ జయరాంరెడ్డి, ఎమ్మెల్యేతో కలిసి శనివారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా.. జన్మనిచ్చిన గ్రామాన్ని, జీవితాన్ని ఇచ్చిన పాఠశాలను ఏ ఒక్కరూ మరిచిపోకూడదన్నారు. సహాయ, సహకారాలు అందించి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే కల్కి సినిమాతో ప్రపంచ స్థాయికి ఎదిగిన నాగ్ అశ్విన్ మన జిల్లా వాసి కావడం మనందరికి ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు.

తల్లిదండ్రుల కోరిక మేరకు..

తన తల్లిదండ్రుల కోరిక మేరకు గ్రామ పాఠశాలలోని సమస్యను పరిష్కరించేందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందించానని, గ్రామంలో గుడి, బడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానంలో రాణించేలా గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చేలా చదివి, డైరెక్టర్లు, యాక్టర్లు, డాక్టర్లు, లాయర్లు కావాలన్నారు. కార్యక్రమంలో నాగ్‌అశ్విన్ తల్లి డాక్టర్ జయంత్‌రెడ్డి, తండ్రి డాక్టర్ జయరాంరెడ్డి, మాజీ సర్పంచ్ ఇందుమతి, డాక్టర్ కృష్ణారెడ్డి, గ్రామస్తులు రాంరెడ్డి, నర్సింహారెడ్డి, డీఈఓ గోవిందరాజులు, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.